

## జర్మన్స్

జర్మన్స్‌కి తాము ఆర్యులమని నమ్మకం. అట్టి నమ్మకంతోనే హిట్లర్ ప్రసిద్ధికెక్కాడు. అనార్యులను తుడిచేస్తానని ప్రగల్భాలు పలికాడు.

ఐన్‌స్టైన్ అనార్యుడని పేరు. పోలికలు ఆర్యుల పోలికలే. జన్మస్థలం జర్మనీయే. జర్మనీలో పుట్టినవారిని జర్మన్స్ అంటారు.

కర్ణాటక ఆంధ్ర రాజ్యలక్ష్మీ వల్లభుడు శ్రీ కృష్ణదేవరాయలు దాసీపుత్రుడని పేరుబడ్డాడు. కాని ఆయన వితరణగుణం వల్ల ఆంధ్రభోజుడని కీర్తి గాంచాడు.

జర్మనీలో ఐన్‌స్టైన్‌పేరు పైకి రాసాగింది. ఆయన విడుదల చేసిన ''సాపేక్ష సిద్ధాంతం'' ప్రసిద్ధి కెక్కింది. ఆయన యొక్క విశిష్ఠత యేమనగా, యితర శాస్త్రజ్ఞులు యితర సబ్జక్ట్స్ సాయంతో సిద్ధాంతం వ్రాసి పేరుపొందితే ఐన్‌స్టైన్ ఒక్క గణితశాస్త్రం ద్వారానే అంతపేరు పొందాడు. ముఖ్యంగా రేఖాగణితం ఆయనకంత పేరు రావటానికి సాయపడింది. రేఖాగణిత పితామహుడు యూక్లిడ్. పిరమిడ్ యెత్తు కనిబెట్టాడు. టైం, కొలతల సాయంతో. ఆయన కాలంలో పెద్ద పరికరాలు లేవు. రేఖాగణితం రానివారు లోనికి రాకూడదు అని వ్రాసి బల్లవాకిలికి అడ్డంగా వుంచాడట ఐన్‌స్టైన్. ఆయన మెల్లిగా పేరు తెచ్చుకుంటున్నప్పుడు, ఆయన దేశీయులు ఆయన్ని ''వాడా! యూదు'' అని హేలగా అనేవారట. ఖండాంతరాలలో గూడా పేరు తెచ్చుకున్నప్పుడు, ''జర్మన్'' అన్నారట దేశీయులు.

ఐన్‌స్టైన్‌కి, నోబెల్ బహుమానం కాక, చాలా గౌరవాలు లభించాయి. కామన్‌వెల్త్ సభ్యుడైనాడు. అప్పుడు స్వదేశీయులు ''మనమూ వాడిని సన్మానించకపోతే, దేశానికి అప్రతిష్ఠ. స్వదేశీయుడినే గుర్తించలేక పోయినారు అని నిందపడతామని, సన్మానించి కొంత భూమి యెలాట్ చేయాలని అనుకున్నారుట. కాని ఆ భూమి అధికారి తన భూమి అమ్మను అని మోరాయించాడట. అదంతా ఐన్‌స్టైన్‌దాకా వెళ్లింది.

''భూమీ వద్దు. సన్మానమూ వద్దు. వూరుకోండి. ఈ గొడవతో పత్రికల్లోకి యెక్కుతున్నారు''అని ఆపేయగలిగాడట.

2

సరస్వతి భర్తవేపు వారంతా, మాంచి ఒడ్డూ పొడుగూ గలిగి, దబ్బపండు రంగు కలిగి, పొడుగాటి సోగముక్కు, వెడద కన్నులూ, విశాల ఫాలభాగమూ గలవారు. తాము ఆర్యసంతతి వారమని నమ్ముతారు. సరస్వతి భర్త అని యెలా పేరు పొందాడంటే, సరస్వతిని తెచ్చుకున్నందుకు ఆమె వలన వచ్చిన కష్టనష్టాలూ నిందలూ నిష్ఠూరాలూ, వుద్యోగరీత్యా వచ్చిన ఒడిదుడుకులూ అన్నీ భరిస్తూ సంసారసాగరం యీదుతూ, మొసళ్లధాటికీ, సముద్రపు దొంగల ధాటికీ, వ్వేల్సు ధాటికీ, కోరమీను ధాటికీ తట్టుకుంటూ అప్పులపాలుకాకుండా, గెజెటెడ్ ఆఫీసరైనాడు. అన్ని భరించాడు గనక భర్త అన్నారు. అంతేగాని శాస్త్రీయంగా కాదు.

ఇక సరస్వతి పొట్టిగా నల్లగా అనాకారి. అందుకని మర్యాదగా అనార్యస్త్రీ అన్నారు. ఆంగ్లంలో చెపితే ప్రిమిటివ్. అంతరంగంలో వున్న తట్టెడు ప్రేమను నవ్వుతూ కలిపి భర్తే అలా అనేవాడు. వేలెడంతలేవు. నా కాలంత లేవు అనేవాడు.

అర్యఅనార్య సంపర్కం జరిగిందని చరిత్రే చెపుతున్నది. అలాగే యిక్కడా జరిగింది. నిరపాయకరంగా వుండటమే గాక భయమూ భక్తీ కలిగి వుంటుందని ఆలోచించి తెచ్చుకున్నాడు.

వసిష్ఠుడు ఆర్షసంప్రదాయంగల ఆర్యుడైతే అరుంధతి మాలెత అని పురాణగాథ. ఆమె మొదటి పేరు ఆరంజోతి. అంటే ఆరనిజోతి. వసిష్ఠుడామెని నూరుసార్లు పుఠం బెట్టాడుట. అయినా ఆరనిజోతి వంటి భక్తితో బతికివస్తూ వసిష్ఠునే అనుసరించిందట. చివరికి వసిష్ఠుని భార్య అయి యెంత గొప్పదయిందంటే, పెళ్లిలో సూత్రధారణ ముగిశాక పెళ్లికూతురూ పెళ్లికొడుకూ, రాత్రికి పురోహితుడు చూపిన సప్తర్షి మండలం చూసి, యేటవాలుగా వున్న మూడు నక్షత్రాలలో, మధ్య నక్షత్రమే వసిష్ఠుడనీ, ఆయన పక్కన

మిలమిలమంటున్న చిన్న నక్షత్రమే అరుంధతి అనీ గుర్తించాలి. చూడగలగాలి. చూడగలిగితే యిద్దరికీ మంచి దృష్టి వున్నదని అర్థం.

మరొకగాథ, సప్త ఋషుల భార్యలు, తడి చీరలతో తిరుగుతూ అగ్నిని కాపాడుతూ ఆరిపోకుండా రగిలిస్తూ, పనిచేసుకుంటుంటే, వారి యవ్వనశ్రీలు చూసిన అగ్ని మోహపడ్డాడుట. సన్నగిలిపోతున్న అగ్నిని ఆయన భార్యా స్వాహాదేవి చూసింది. ఆర్గురు ఋషిపత్నుల రూపం దాలి భర్తను సంతోషపెట్టింది. కాని అరుంధతీ రూపం దాల్చలేక పోయింది. చాత కాలేదు. ఆమె పుత్రుడే షణ్ముఖ. వాడిని రెల్లు దుబ్బుల్లో దాచింది. ఆ షణ్ముఖుని చూసిన పరమేశ్వరి ఆ బిడ్డను తెచ్చి పెంచుకున్నది. అందుకే షణ్ముకజననీ అని పేరు దాల్చింది. ఇక్కడ స్వాహాదేవి అరుంధతీ రూపం దాల్చలేకపోయిందనేది ముఖ్యం.

అలాగే యీ కథలో సరస్వతి అనే అమ్మాయి భర్తనే అంటిపెట్టుకుని వుండి, నిందలూ, నిష్ఠూరాలూ అవమానాలూ భరిస్తూ మంచిపేరు తెచ్చుకుని, ఆస్థాన విద్వాంసురాలైంది. అప్పుడు భర్తవేపువారు తామూ ఆమెను సన్మానించి ఆస్తిలో భాగమివ్వకపోతే, లోకులు స్పిట్టూన్ కనపడక తమమీదికి దాడి చేస్తారేమోనని భయపడి, మీటింగ్‌పెట్టుకుని చర్చించి తీర్మానించాలని నిశ్చయించారు.

తమ వూళ్లోనే సన్మానం పొందటానికి సరస్వతి వస్తున్నదని వార్త అందింది. తమ యిల్లు గూడా పావనం చేయమని సరస్వతికి అర్జీ పెట్టుకున్నారు. కారు తెచ్చి తీసికెళ్తామని యెరపెట్టారు.

బోనులో యెలుకను పట్టి తెచ్చినట్టు కారులో సరస్వతిని తెచ్చారు. గౌరవించాలని వున్నది కాబోలనుకున్నది సరస్వతి.

ఇంట్లో యింటి పెద్ద యిన్‌లా కాని యిన్‌లా అన్నది. ‘‘కాఫీ వుప్మా రుచిగా చేస్తావు. నువ్వుచేసి, అందరికీ పెట్టి నువ్వు తినాలి. నా యిల్లు. నా వాళ్లు అనుకోవాలి. గతం గతవేం. వూ వాడు వుమ్మల్ని సంప్రతించకుడా స్వతంత్రించటం వల్ల గలభా అయింది. మాటమాత్రం మాతో చెప్పివుంటే

గప్‌చుప్‌గా ఒక్కపూటలో శాస్త్రీయంగా అంతా జరిగేది. ఇప్పుడేం పోయిందీ? నీకు సంతునిచ్చాడు. పేరూ ప్రతిష్ఠా తెచ్చాడు మావాడు నీకు'' అలా అంటూ కలుపుగోలుతనం తెలియాలని విశాలంగా నవ్వింది. దొంగనవ్వు నవ్వుతూ దాష్టీకం చేసింది. కర్రపెత్తనం చేసింది యింటి పెద్ద. తన స్టేటస్ చూపాననుకున్నది.

మధ్యాన్నం భోజనాలయాక గంట విరామం. తర్వాత మీటింగ్. సభ్యులు చాలామంది, కుర్చీల నిండుగా ఠీవిగా కూచున్నారు.

అధ్యక్షుడు లేచి అన్నాడు.

''సభ్యులారా! మనం యిన్నాళ్లూ, కళ్లూ చెవులూ మూసుకుని పొరపాటు చేశాము. ప్రమాదో ధీమతామపి అన్నారు. గుర్తించాల్సిన వారిని గుర్తించలేదు. పొరపాటు దిద్దుకుందాము. గుర్తింపునిచ్చి, వారి వాటా వారికిచ్చి, న్యాయం ధర్మం పాటిద్దాము. వాటా యెటువేపు యివ్వాలీ అనేది చర్చనీయాంశము. తీర్మానిద్దాము'' అని కూచున్నాడు, యిన్‌లా కాని యిన్‌లా.

''దొడ్డివేపు యేమి వేసినా, కూరలుగానీ, పూలుగానీ పండటం లేదు. పూయటం లేదు. వాటా పొందపోయే ఆమె యిక్కడే వుండదు గనక ఆ స్థలం ఆమె వాటా అని చెపితే చాలు'' అని కూచున్నాడో సభ్యుడు.

''లెట్రిన్‌వేపు గొంది వూరికేనే వున్నది దాని నెవరూ కొంటామని రావటం లేదు. రెండూ కలిపి అమ్మితే కొంటామంటున్నారు. అలా అమ్మితే అసౌకర్యమని అమ్మలేదు'' అని యిబ్బంది చెప్పాడో సభ్యుడు.

''వంటింటికివతల వున్న చీకటి గది యిస్తే, ఆమె పాత సామాను అందులో భద్రం చేసుకోవచ్చు. లేదా చీరెలు సారెలు నగదు యినప్పెట్టే పెట్టుకోవచ్చు. ఆ గదికన్నివైపులా రక్షణ వుంటుంది. లాకర్‌లాగా పనిచేస్తుంది. ఆమె వచ్చినప్పుడు నిరాక్షేపణీయంగా తన వస్తువులు తాను తీసికెళ్ళొచ్చు. ఈ యింటి సభ్యురాలేగా. పరాయి గాదు'' అని కూచున్నదో లా చదివిన ఆర్య వనిత.

''వీధివేపు మంచినీళ్ల బావి వున్నది. ఆ బావిలో సగమూ, దాని అవతలవున్న వందగజాల స్థలమూ ఆమె వాటాగా నిర్ణయిస్తే అటుగా యెవరూ

రారు. పాక వేసుకుంటామని అద్దెకు ఆ స్థలం అడగరు. అక్కడంతా పల్లేరు కాయలు, బలురక్కసిచెట్లూ, బొమ్మ జెముడు, ఉమ్మెత్త, భూతులసి మొక్కలు, కుంకుడు మొక్కలు పెరిగాయి. క్రోటన్సన్నాగాదు. ఆమె డబ్బు యిబ్బంది వచ్చినప్పుడు దానినెవరికైనా అమ్మేయచ్చు. లేదా గొట్టపు బావి వేయించివూరి వారికి మంచినీటి యెద్దడి పరిష్కరించవచ్చు'' అన్నదో శాసన సభ్యురాలు.

'' ఆమెకు స్తోమత వచ్చింది గనక లిఫ్ట్ వేయిస్తే ఫిఫ్త్ ఫ్లోర్ యివ్వచ్చు. దాని మీదింకా గదులు లేవలేదు. ఆధారాలుగా చిన్న స్తంభాలున్నాయి. అపార్ట్‌మెంట్ లేవదీసి అమ్మేస్తే లాభం వస్తుంది. లిఫ్ట్‌కోసం వదలిన జాగా నిరుపయోగంగా వున్నది'' అన్నాడో సెప్తునేరియన్ రిటైర్డ్ ఆఫీసర్. ఆయన టౌన్ ప్లానింగ్ సభ్యుడు.

కొద్ది నిమిషాలలో సలమాలు యెక్కువై రణగొణ ధ్వని బయలుదేరింది. మధ్యమధ్య

''నువ్వేమంటావు? పోనీ నువ్వే నిర్ణయించు యెటుకావాలో చెప్పు'' అని సరస్వతిని అడిగారు.

''మేము సూచించిన వాటిల్లోనే యెన్నుకోవాలి'' అన్నదో యిన్‌లా.

సరస్వతి లేచి నిలబడింది.

''మీరు టైమ్ చూడలేదు. నాలుగు దాటింది. నేను పోవాలి. అయిదింటికల్లా సారస్వత సమావేశం మొదలౌతుంది. నేనక్కడుండాలి. నిలకడగా వుద్యోగం చేస్తూ, సమర్ధత చూపుతూ, నిర్వహించుకొచ్చిన ఒక వనితామణి డి యెమ్మెస్ అయింది. ఆమెను సన్మానింపదలచి సభ యేర్పాటు చేశారు. అన్ని రంగాలలో స్త్రీలు సమర్ధతతో నిర్వహించుకొస్తున్నారని పేపర్లు రిలీజ్ చేసింది. విదేశీపత్రికలలో గూడా ఆమె ఆర్టికిల్స్ పడినాయి. సలహాదారుగా గూడా నియమించబడింది. రాజకీయాలలోనూ అభినివేశమిస్తే దేశానికి పేరు తెస్తారన్నది.

ప్రస్తుతం మీరు సమగ్ర పథకం లేకుండా సభ చేసి చర్చించారని తేలింది. కాని ప్రమోషన్ పొందిన నా భర్తగారు, యీ యింటి కుటుంబ సభ్యుడు, తాను గృహస్తు కాబోయే ముందే సమగ్ర పథకం వేసి అమలు జరిపారు. అనార్య సంపర్క మందుకే చేశారు. సమాజాన్నీ శాస్త్రాన్నీ ధిక్కరించినదందుకే. ఆయన ధైర్యానికీ, దూరదృష్టికీ, పట్టుదలకీ జోహార్లు. స్థిరాస్థిలో గానీ, భవంతిలో గానీ, చరాస్తిలో గానీ తనకు సంబంధం లేదనీ, వదలి వేశాననీ, అదే కారణం వల్ల తన భార్యకూ యేమీ చెందవనీ దస్తావేజు మీద వ్రాయించి, స్టాంపు అతికించి ఆ పత్రం మీద యిద్దరు న్యాయవాదుల చేత సంతకాలు చేయించి, సాక్షులుగా వుంచారు. తానూ సంతకం చేశారు. ఒక నకలు జిల్లా కోర్టులో, మరొకటి రక్షణ శాఖ వారి వద్ద, మూడవ నకలు తన వద్ద వుంచారు. అయినా ధర్మమూ న్యాయమూ గౌరవము తెచ్చిస్తాయని నమ్మి ఆచరించారు. పదవిలోకి పోగలిగారు'' అంటుండగా కారు హారన్ వినబడింది.

తీసికెళ్లేవారు కార్లోంచి దిగిరావటం, సభ్యులంతా చూశారు.